telangana chowrasta.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:304

24 క్యారెట్లు 1,62,770.00 | కిలో వెండి 2,94,900.00 | CHOWRASTHA DIGITALS | 27.05.2026 బుధవారం, హైదరాబాద్



## వడదెబ్బతో 62 మంది మృతి

- తెలంగాణలో 54 మంది, ఏపీలో 18 మంది హతం
- మధ్య వయస్కులలోనూ మరణాలు
- అసాధారణంగా వీస్తున్న తీవ్ర వడగాల్పులు
- మరో 4 రోజుల ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం
- చరిత్రలో తొలిసారిగా రెడ్ అలర్ట్
- ఏపీ, తెలంగాణలో భానుడి ప్రతాపం

2

## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

- అనుమతిచ్చిన కోర్టు
- నేడు చర్లపల్లి జైలునుంచి సిట్ కార్యాలయానికి తరలింపు విచారించనున్న బృందం
- ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం సిద్ధం



2

## విద్యాసంస్థల్లో బాలికలకు టాయిలెట్లు లేవు

- శానిటరీ న్యాప్‌కిన్స్ లేవు
- వీటివల్ల బాలికలు చదువు మానేయకుండా చూడాలి
- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం



2

## ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా బుక్కైన ఎంఆర్‌ఓ సుచరిత

- నాలా కన్వర్షన్‌కు ఎకరాకు రూ. లక్ష డిమాండ్
- 30 ఎకరాలకు రూ.30లక్షల లంచం
- మొదటి విడతగా 2 లక్షలు తీసుకుంటూ అరెస్ట్



2



దేశవ్యాప్తంగా మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

# సామాన్యుడిపై పెట్రో బాదుడు

## దుర్భరంగా మారిన గిగ్ వర్కర్స్ జీవితాలు

సామాన్యుడి బతుకు బండి మరింత భారంగా

ఏకంగా లీటర్ పై రూ.3 మేర పెంపు

హైదరాబాద్లో లీటరు పెట్రోల్ రూ.115

పదిరోజుల వ్యవధిలో ఏకంగా లీటర్ పెట్రోల్‌పై రూ.7.13

డీజిల్‌పై రూ.8.06 పెంపు

తమకు న్యాయం చేయాలంటున్న గిగ్ వర్కర్లు

2

మహానగరం హైదరాబాద్లో చక్రాలపై సాగే సామాన్యుడి బతుకు బండి మరింత భారంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్ సాకుతో చమురు సంస్థలు మళ్లీ ధరలను పెంచాయి. తాజాగా సోమవారం ఏకంగా రూ.3 మేర పెంచడంతో హైదరాబాద్లో లీటరు పెట్రోల్ ధర రూ.115 మార్కును చేరింది. ఈ పెంపు గిగ్ కార్మికులు (ఆటో, క్యాబ్,ఈ-కామర్స్ డెలివరీ బాయ్స్, బైక్ టాక్సీ డ్రైవర్లు, ఫుడ్) గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తోంది. ఒకవైపు పెట్రో మంట మరోవైపు ఆన్‌లైన్ అగ్రిగేట్ సంస్థల అడ్డగోలు కమీషన్ల దందా నడుస్తోంది. వీరి మధ్య ఈ యాప్ కార్మికులు చీమల్లా నలిగిపోతున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వీధుల్లో తిరిగినా కొంత మొత్తమే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో*



## మావోయిస్టు సిసి మెంబర్ నరహరి సరెండర్

- ఆయన భార్య దానమ్మతో పాటు లొంగుబాటు
- నరహరికి రూ.25 లక్షలు, దానమ్మకు రూ.35 లక్షల చెక్కులను అందజేత
- ఇంకా 47 మంది మావోయిస్టులు మిగిలి ఉన్నారు
- వారి స్థితిగతులను పరిశీలిస్తా
- గ్రేహౌండ్స్, ఎస్ఐబీలు కొనసాగుతాయి
- గణపతి, ఆయన భార్య జోడె లక్ష్మీబాయి, వార్త శేఖర్‌లు లొంగిపోండి
- డీజీపీ సి.వి ఆనంద్ పిలుపు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

మావోయిస్టు మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు పుసునూరి నరహరి (64), తన భార్య దానమ్మతో సహా రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ సమక్షంలో మంగళవారం జనజీవన స్రవంతిలో కలిశారు. వీరి లొంగుబాటుతో మావోయిస్టు కేంద్ర కమిటీలో ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు ఎలియాస్ గణపతి, ఆయన భార్య జోడె లక్ష్మీబాయి, మరో నాయకుడు వార్త శేఖర్‌లు మాత్రమే తెలంగాణకు చెందినవారు మిగిలి ఉన్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ మాట్లాడుతూ.. నరహరి, భార్య దానమ్మలు ఇటీవలనే ఎస్ఐబీ అధికారుల వద్దకు చేరారనీ, వారికి మలేరియా, డెంగ్యూ వ్యాధులు ఉండటంతో చాలా నీరసించి పోయారనీ, వారికి అత్యవసర చికిత్సలను

..మిగతా 2 లో



## రైతన్నను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం

- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి
- బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్,
- నీరుకుళ్ల సొసైటీ కొనుగోలు కేంద్రం సందర్శన

2

## ప్రభుత్వ భూములను కాపాడాలి

- శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణం
- దీనిపై సిట్ లేదా సీఐడీ విచారణ జరిపించాలి
- 170 ఎకరాల ప్రభుత్వ భూమి పట్టా ఎలా అయ్యింది?
- ఆర్డీవో, తహశీల్దార్ వేర్వేరు నివేదికలు ఇవ్వడమేంటీ
- ఈ స్కాం వెనుక ప్రభుత్వ పెద్దలెవరో తేల్చాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

2




## వెళ్లగొట్టకముందే పారిపోండి

- అక్రమ వలసదారులకు బంగాల్ సీఎం వార్నింగ్
- అక్రమ వలసదారులకు తిండిపెట్టడం దండగ
- దేశ ప్రయోజనాల కోసం వారిని తిప్పి పంపుతున్నాం
- బంగాల్ సీఎం సువేందు అధికారి



2

# వడదెబ్బతో 62 మంది మృతి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భానుడి భగభగలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటం ప్రజలి భయాందోళనకు గురిచేస్తోంది. సోమవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తీవ్రమైన ఈ ఎండ వేడిమికి, వడదెబ్బకు గురై రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 18 మంది మృత్యువాత పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. అటు తెలంగాణలోనూ సోమవారం ఒక్కరోజే 54 మంది మృతిచెందారు.

**మధ్య వయస్కులలోనూ మరణాలు**

ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లోనూ మరణాలు సంభవించాయి. కాకినాడ రూరల్ కూరాడకు చెందిన టేకుమూడి సూర్యనారాయణ (80), మూలపేటలో ఒక వ్యక్తి (30), చినజగ్గంపేటలో ఆచార్యులు (85) మరణించారు. అనకాపల్లి జిల్లా వేంపాడులో ఓ యాచకురాలు (70), డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం చిన్నపేటకు చెందిన ఇసుకపట్ల బుజ్జిబాబు (43), పి గన్నవరంలో ఒక వృద్ధుడు, యర్రంశెట్టివారిపాలేనికి చెందిన కొండేటి చినసత్యవతి (59) వడదెబ్బకు బలయ్యారు. పల్నాడు జిల్లా కట్టావారిపాలేనికి చెందిన చవల తిరుపతమ్మ, కోనసీమ జిల్లా అనాతవరానికి చెందిన జంగం శివనాగేశ్వరరావు, పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన పి. నాగఅప్పారావు (45)లతో పాటు, ఏలూరు జిల్లా కొత్రగుంటపాలేనికి చెందిన 104 ఏళ్ల వృద్ధురాలు కొండూరి అనసూర్యమ్మ కూడా ఈ ఎండ తీవ్రతకు చనిపోయారని సమాచారం.

**తెలంగాణలో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ..**

తెలంగాణలో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడి భగభగలకు తోడు అసాధారణంగా వీస్తున్న తీవ్ర వడగాల్పులతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రంలో మరో 4 రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న రోజుల్లో అత్యంత ప్రమాదకర స్థాయిలో వడగాల్పులు వీచే ఆస్కారం ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడగాల్పుల తీవ్రతపై రాష్ట్రంలో ఇలాంటి ముందస్తు హెచ్చరిక జారీ కావడం ఇదే మొదటిసారి.

**వడదెబ్బతో 54 మంది మృతి**

తీవ్రమైన ఎండలు రాష్ట్రంలో పెను విషాదాన్ని నింపుతున్నాయి. సోమవారం ఒక్క రోజే వడదెబ్బకు గురై రాష్ట్రవ్యాప్తంగా 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 17 మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 14 మంది మృతిచెందారు. కరీంనగర్‌లో ఏడుగురు, నల్గొండలో ఆరుగురు, ఆదిలాబాద్‌లో ఐదుగురు, నిజామాబాద్‌లో ఇద్దరు, మహబూబ్‌నగర్ మరియు సిద్దిపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన ఆటో డ్రైవర్ అహ్మద్ ఆరిఫ్ (50) ఎండ తీవ్రత తట్టుకోలేక తన ఆటోలోనే సేదతీరుతూ వడదెబ్బతో అక్కడికక్కడే కన్నుమూయడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ముఖ్యంగా పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతితీవ్ర వడగాల్పులు వీచే ప్రమాదం ఉన్నందున ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. వీటితో పాటు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ వంటి మరో ఎనిమిది జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు సైతం ఎల్లో అలర్ట్ అలర్ట్ జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

# సామాన్యుడిపై పెట్రో బాదుడు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**




మహానగరం హైదరాబాద్లో చక్రాలపై సాగే సామాన్యుడి బతుకు బండి మరింత భారంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్ సాకుతో చమురు సంస్థలు మళ్లీ ధరలను పెంచాయి. తాజాగా సోమవారం ఏకంగా రూ.3 మేర పెంచడంతో హైదరాబాద్లో లీటరు పెట్రోల్ ధర రూ.115 మార్కును చేరింది. ఈ పెంపు గిగ్ కార్మికులు (ఆటో, క్యాబ్, ఈకామర్స్ డెలివరీ బాయ్స్, బైక్ టాక్సీ డ్రైవర్లు, ఫుడ్) గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తోంది. ఒకవైపు పెట్రో మంట మరోవైపు ఆన్‌లైన్ అగ్రిగేట్ సంస్థల అడ్డగోలు కమీషన్ల దందా నడుస్తోంది. వీరి మధ్య ఈ యాప్ కార్మికులు చీమల్లా నలిగిపోతున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వీధుల్లో తిరిగినా కొంత మొత్తమే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ యాప్ ఆధారిత సంస్థలు టెక్నాలజీని అడ్డం పెట్టుకుని వినియోగదారులపై అదనపు ఛార్జీలు, ఫ్యూయల్ సర్‌ఛార్జిల భారాన్ని తక్షణమే విధిస్తున్నాయి. కానీ, బైక్‌లు, ఆటోలు నడిపే కార్మికులకు మాత్రం ఆ పెంచిన మొత్తంలో వాటాను ఏ మాత్రం బదిలీ చేయడం లేదు. కష్టమర్ల నుంచి వసూలు చేసే మొత్తంలో దాదాపు 25 నుంచి 30 శాతం వరకు కంపెనీలే కమీషన్ రూపంలో దండుకుంటున్నాయి. చమురు ధరలు పెరిగినా డ్రైవర్లకు ఇచ్చే కనీస ధర మాత్రం ఐదేళ్ల క్రితం నాటిదే. పెరిగిన భారాన్ని కార్మికుడిపైనే నెట్టేస్తూ కార్పొరేట్ సంస్థలు మాత్రం లాభపడుతున్నాయి.

గతంలో రోజుకు 10 గంటలు కష్టపడితే పెట్రోల్ ఖర్చులు పోను రూ.700 నుంచి 800 వరకు డబ్బులు మిగిలేవని గిగ్ కార్మికులు చెబుతున్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. పెట్రోల్ ధర రూ.115 కావడంతో రోజువారీ సంపాదనలో సగానికిపైగా పెట్రోల్కే సరిపోతుంది. మిగిలిన కొద్దిపాటి మొత్తంతో ఇంటి అద్దెలు, బైక్ ఈఎంఐలు, నిత్యావసరాలను కొనుక్కొని కుటుంబాలను పోషించడం గిగ్ కార్మికులకు ప్రస్తుతం అసాధ్యంగా మారింది. ఐటీ రంగంలో విప్లవంగా చెప్పుకొనే గిగ్ ఎకానమీ వెనుక ఉన్న లక్షలాది మంది కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకునే వారే కరవయ్యారు. అగ్రిగేటర్ల దోపిడీని అరికట్టేందుకు, కనీస కిలోమీటర్ ధరను నిర్ణయించేందుకు రవాణా శాఖ వద్ద ఇప్పటికీ నిర్దిష్టమైన నిబంధనలు లేకపోవడం వీరికి పెను శాపంగా మారింది.

గ్రేటర్ హైదరాబాద్లో ప్రజలపై చమురు సంస్థలు నాలుగోసారి పెట్రోలు, డీజిల్ ధరలను పెంచాయి. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69, డీజిల్ ధర 103.82 తాకాయి. పెట్రోలు, డీజిల్ ధరలు లీటరుకు ఏకంగా రూ.2.88 వడ్డించాయి. రెండు రోజుల క్రితం లీటరు 99 పైసలు పెర్గగా తాజాగా రూ.2.88 పెరగడం ఇప్పుడు తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. పెంచిన ధరలు సోమవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి రావడంతో ఉదయం పెట్రోలు బంకులకు వెళ్లిన వారు షాక్ అయ్యారు.

పదిరోజుల వ్యవధిలో ఏకంగా లీటర్ పెట్రోల్‌పై రూ.7.13, డీజిల్‌పై రూ.8.06 పెరగడం ఇప్పుడు చాలా పెద్ద విషయం. అనూహ్యంగా పెట్రోలు, డీజిల్ రేట్లు పెరుగుతుండటంతో వాహనదారులకు దిక్కుతోచని పరిస్థితులు ఉన్నాయి. ఈనెల 15వ తేదీ వరకు పెట్రోలు రూ.107.46పై ఉండగా ప్రస్తుతం రూ.115.62కు, డీజిల్ రూ.95.70 నుంచి రూ.103.76కు ధరలు పెరిగింది. గ్రేటర్‌లో పెట్రోలు రోజుకు 35 లక్షల లీటర్లు, డీజిలు 50 లక్షల లీటర్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ప్రజలపై రోజుకు రూ.2.55 కోట్ల అదనపు భారం పడనుంది. బైక్ టాక్సీ, ఆటోడ్రైవర్లు, ఫుడ్, క్విక్ కామర్స్, డెలివరీ బాయ్స్ ఇలా గిగ్ వర్కర్లు అంతా కలిపి హైదరాబాద్ వ్యాప్తంగా 4 లక్షల మంది ఉంటారని అంచనా. ఒక్కో గిగ్ కార్మికుడు రోజుకు సుమారు 3 లీటర్ల పెట్రోల్ వాడతారు. అందుకు రూ.345 వ్యయం అవుతుంది. ప్రతిరోజూ గిగ్ కార్మికులంతా కలిసి రోజూ దాదాపు 11 లక్షల లీటర్ల పెట్రోల్‌ని వాడుతున్నారు. ఇందులో సీఎన్‌జీ మళ్లీ అదనం. కేవలం పెట్రోల్ కోసమే రోజుకు రూ.12.65 కోట్లను బంకుల్లో ఖర్చు చేస్తున్నారు.



# రైతన్నను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రైతులు అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విమర్శించారు. 'రైతు గోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు రైతులతో మాట్లాడారు. 15 రోజులుగా కల్లాల్లో వడ్లు ఆరబోసుకుని పడిగాపులు కాస్తున్నామని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తేమ శాతం, లారీలు లేవనే సాకులు చెప్పి కొనడం లేదని, అకాల వర్షాలకు పంట కండ్ల ముందే తడిసి మొలకెత్తుతోందని తెలిపారు. దాంతో ఎంపీలు పెంచికలపేట సొసైటీ కార్యదర్శి ఓదెల లక్ష్మయ్యను పిలిపించారు. వారాల తరబడి ధాన్యాన్ని ఎందుకు కొనడం లేదు? రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. వెంటనే కొనుగోళ్లు మొదలుపెట్టాలని, లేకపోతే బీజేపీ రైతుల పక్షాన ఉండి ఉద్యమిస్తుందని చెప్పారు. అనంతరం విలేకరులతో ఎంపీలు మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. యాసంగిలో ఎంత ధాన్యం దిగుబడి వస్తుందో కనీస అంచనా వేయకుండా కొనుగోలు కేంద్రాలు తెరిచామంటూ మంత్రులు డ్రామాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు

# ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా బుక్కైన ఎంఆర్ఓ సుచరిత

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. బాధితుని నుంచి తహసీల్దార్ డ్రైవర్ నాగేష్ లంచం డబ్బులు తీసుకుని ఆమెకు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు. శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ.. అలియాబాద్ ప్రాంతానికి చెందిన 30 ఎకరాల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి తహసీల్దార్ సుచరిత భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఎకరానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. దాతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించాడని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో బాధితుని నుంచి తహసీల్దార్ కారు డ్రైవర్ రూ.2లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నామని తెలిపారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎమ్మార్వోతోపాటు కీసర ఆర్డీఓ రాజేష్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. 2024లో కూడా ఇదే శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

# విద్యాసంస్థల్లో బాలికలకు టాయిలెట్లు లేవు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

దేశంలోని విద్యా సంస్థల్లో బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు లేవని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ లేని కారణంగా బాలికలు చదువు మానేయకుండా చూడాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు సూచనలు చేసింది. జస్టిస్ బి పార్దివాలా, ఆర్. మహదేవన్ ఆధ్వర్యంలోని ధర్మాసనం తాజాగా ఈ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికీ దేశంలోని విద్యా సంస్థల్లో బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు లేవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో గత జనవరి 30న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. విద్యా సంస్థల్లో శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలని, బాలికల కోసం విడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్స్ అందించాలని సూచించింది. ఇవి సద్వినియోగం అయ్యేలా చూడాలని, దేశంలోని బాలికలు, మహిళలకు ఎంతో మేలు చేస్తాయని కోర్టు అభిప్రాయపడింది. ఈ సదుపాయాలు లేని కారణంగా చాలా మంది ఆడపిల్లలు చదువు మానేసి, ఇంట్లో పనులకు అంకితమవుతున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పును అమలు చేయడం, దాని ఫలాలు అందరికీ అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత అని ధర్మాసనం తెలిపింది. గతంలో ఆదేశించిన ప్రకారం ప్రభుత్వ విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ ఏర్పాటు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డాటా సేకరించారా? అని కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనికి రెండు నెలల క్రితమే ప్రాథమిక డాటా సేకరించినట్లు కేంద్రం బదులిచ్చింది. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం నిరంతరం డాటా సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదిక తెప్పించుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

# వెళ్లగొట్టకముందే పారిపోండి

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**



బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియను వేగవంతం చేయాలని బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అధికారులను ఆదేశించారు. ఉత్తర 24పరగణాల జిల్లా హకీంపూర్ చెక్‌పోస్టు వద్ద బంగ్లాదేశ్‌కు చెందినవారు పెద్దసంఖ్యలో గుమిగూడిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నదియా, హుగ్లీ, ఉత్తర 24 పరగణాల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన తర్వాత సీఎం సువేందు మీడియాతో మాట్లాడారు. సరిహద్దు వద్ద గుమిగూడిన బంగ్లాదేశీయులు తిరిగి వెళ్లడానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. బంగ్లాదేశీయులు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని లేకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సరిహద్దు వద్ద గుమిగూడినవారిని ఉద్దేశించి బెంగాల్ సీఎం అన్నారు. వారిని జైళ్లలో పెట్టి తిండిపెట్టడం వల్ల ప్రజాధనం వృథా చేయడమే అవుతుందన్నారు. అది నిజానికి భారతీయులకు ముఖ్యంగా బంగాల్ ప్రజలకు మేలు చేయదన్నారు. రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అక్రమ వలసదారులను తిప్పి పంపుతున్నట్లు సీఎం సువేందు అధికారి తెలిపారు. బంగాల్లో ఉంటున్న అక్రమ వలసదారులను ఏరివేయడానికి సువేందు సర్కార్ జిల్లాల వారీగా జైళ్ల లాంటి 'హోల్డింగ్ సెంటర్లు' ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. దీనితో వందలాది మంది బంగ్లాదేశీయులు తమ సొంత దేశానికి తిరిగి వెళ్లిపోవడానికి ఉత్తర 24 పరగణా జిల్లాలోని హకీంపూర్ సరిహద్దు చెక్పోస్టు దగ్గరకు భారీ చేరుకుంటున్నారు. దీన్ని ఇప్పుడు 'రివర్స్ ఎక్సోడస్' (వెనక్కి వెళ్లిపోవడం) అని పిలుస్తున్నారు. భారతదేశంలోకి అక్రమంగా వచ్చిన వారిని గుర్తించి, ఓటర్ లిస్టు నుంచి వారి పేర్లు తీసేసి, దేశం నుంచి వెళ్లగొడతామని ఇప్పటికే ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పష్టం చేశారు. ఇందుకోసం 'డిటెక్ట్, డిలీట్ అండ్ డిపోర్ట్' పద్ధతిని కఠినంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఇలా ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఈ మార్పు మొదలైంది. మంగళవారం హకీంపూర్ బోర్డర్ దగ్గర పెద్దపెద్ద బ్యాగులు, దుప్పట్లు, ప్లాస్టిక్ షీట్లతో జనం మళ్లీ కనిపించారు. పోయిన ఏడాది చలికాలంలో ఎస్ఐఆర్ జరిగినప్పుడు కూడా బంగాల్లో ఇలాంటి సీన్లే కనిపించాయి. మళ్లీ ఇప్పుడు మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలు గుంపులుగా కూర్చొని బంగ్లాదేశ్లోకి వెళ్లడానికి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) అధికారులు తమ పేర్లు ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లోని ప్రజలకు ఈ దృశ్యాలు పాత రోజులను మళ్లీ గుర్తుచేస్తున్నాయి. ఎందుకంటే గతేడాది ఓటర్ల జాబితా తనిఖీలు చేసినప్పుడు మొదటిసారి ఇలా జనం వెనక్కి వెళ్లడం కనిపించింది. ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా బీజేపీ ప్రభుత్వం వచ్చి, ఈ తనిఖీలను మరింత గట్టిగా చేస్తుండడంతో అక్రమవలసదారులు మళ్లీ పారిపోతున్నారు. హకీంపూర్ చెక్ పోస్ట్ దగ్గర గత రెండు రోజుల్లోనే 100 మందికి పైగా బంగ్లాదేశీయులు గుమిగూడారు. వారు తమ వెంట లగేజీ ట్రాలీలు, వంట పాత్రలు, బట్టల మూటలను తెచ్చుకున్నారు. రేపు ఏం జరుగుతుందో అనే భయంతో హడావుడిగా ఇళ్లు ఖాళీ చేసి వచ్చినట్లు ఆ మూటలు చూస్తే అర్థమవుతోంది. వీరంతా ఇన్నాళ్లూ కోల్కతా పరిసరాల్లోని దమ్దమ్, న్యూటౌన్, దాన్కుని వంటి ప్రాంతాల్లో తాపీ పనులు, కూలీ పనులు, ఇళ్లలో పనులు చేస్తూ బతుకుతున్నారు.

మరోవైపు, భారత్లోకి అక్రమంగా వచ్చిన బంగ్లాదేశీయులు, రోహింగ్యాలను పట్టుకొని, వారి వివరాలు తేలేవరకు ఉంచడానికి బంగాల్ ప్రభుత్వం జిల్లాల్లో హోల్డింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే మాల్దా జిల్లాలో తొమ్మిది మంది బంగ్లాదేశీయులను హోల్డింగ్ సెంటర్లో ఉంచారు.

# ప్రభుత్వ భూములను కాపాడాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**




రైతుల ధాన్యం కొనుగోలు చేతగాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాదు గానీ, ప్రభుత్వ భూములను అందిన కాడికి కాంగ్రెస్ నాయకులు కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణాన్ని ధారాలతో సహా బయట పెడుతున్నామని అన్నారు. దీనిపై సిట్ లేదా సీఐడీ విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగస్వాములైన పెద్దలెవరో తేల్చాలనీ, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ లో173 నుంచి 183 మధ్య ఉన్న భూమిలో 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే కుట్ర జరిగిందని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ఆక్రమణకు గురి కాకుండా ఉండాలని తహశీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారని గుర్తు చేశారు. ప్రొహిబిషన్ జాబితా 22ఏలో పెట్టాలన్నారని చెప్పారు. ఈ ఏడాది జనవరి 30న హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్ లో పొందుపర్చారని అన్నారు. ఇది ప్రభుత్వ భూమి అని ఫిబ్రవరి 24న తహశీల్దార్ తేల్చారని వివరించారు. నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28న ఈ భూమి ప్రయివేటు వ్యక్తులకు చెందుతుందని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ భూమి ప్రయివేటు భూమి ఎలా అయ్యిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ భూమిని భూ భారతి ఆన్ లైన్ లో కూడా పెట్టాలన్నారని చెప్పారు. ఆర్డీవో, తహశీల్దార్ రెండు భిన్నమైన నివేదికలు ఇస్తే జీపీ రెవెన్యూ హైకోర్టుకు ఎలా ఇచ్చారని అడిగారు. ఏ ఆదేశాలైనా కలెక్టర్ ఆమోదంతో హైకోర్టుకు వెళ్తుందనీ, కలెక్టర్ ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. దీన్ని అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఏ రకంగా ఆమోదించారని అన్నారు. రూ.వెయ్యి కోట్ల విలువైన భూములకు సంబంధించి ఇంత పెద్ద కుంభకోణం జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ స్కాం గురించి మీడియాలో వస్తే ఈ కేసులో కేవలం తహశీల్దార్‌ను కలెక్టరేట్ కు బదిలీ చేసి ఊరుకున్నారని చెప్పారు. ఏసీబీ అధికారులు తనిఖీలకు వెళ్లారనీ, ప్రభుత్వ పెద్దలు ఏం చెప్పారో ఏసీబీ వారు వెనక్కి వచ్చారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడు ఇందులో ఉన్నాడు కాబట్టే ఏసీబీ వెనక్కి వచ్చిందని ఆరోపించారు. ఒత్తిడి కారణంగానే తహశీల్దార్ కేవలం బదిలీ అయ్యారని చెప్పారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తహశీల్దార్‌ను కాపాడటంలో ఉన్న పెద్దలెవరు? వారు బయటకు రావాలని డిమాండ్ చేశారు. భూ భారతిలో భూమి చేరాలంటే దరఖాస్తు పెట్టాలనీ, ఆర్డీవో దాన్ని ఆమోదించాలని చట్టంలో ఉందన్నారు. కానీ తహశీల్దార్ భూభారతిలో పెట్టాలని చెప్పగానే అది నమోదైందని వివరించారు. 170 ఎకరాలు ప్రభుత్వ పట్టా భూమిని ఎలా ఎక్కించారని ప్రశ్నించారు. ఈ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోరనీ, ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టరని అడిగారు. తహశీల్దార్ ఆదేశాలను సస్పెండ్ చేయాలనీ, ఆ అధికారిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆర్డర్ మీద అప్పీల్ కు వెళ్లాలనీ, ఆ భూమిని తిరిగి నిషేధిత జాబితో పెట్టాలని కోరారు. జగిత్యాలలో ఆర్టీసీ డ్రైవర్ పై సస్పెhన్షన్ వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డ్రైవర్ అశోక్ ధాన్యం కొనుగోలు చేయాలని మాట్లాడితే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఆయన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. దీనిపై న్యాయపోరాటం, ప్రత్యక్ష పోరాటానికి పూనుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు




# మావోయిస్టు సిసి మెంబర్ నరహరి సరెండర్

▶▶ మొదటిపేజీ తరువాయి

అందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి మెరుగైందని డీజీపీ తెలిపారు. వీరి లంగుబాటుతో మావోయిస్టుల ఉనికి దాదాపుగా కోల్పోయినట్టేననీ, అయితే రాష్ట్రానికి చెందిన ముగ్గురు, ఏపీకి చెందిన ఒకరితో కలిపి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లకు చెందిన మొత్తం 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారనీ, వారు కూడా త్వరలోనే జనజీవన స్రవంతిలోకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సంక్షేమ పథకాలను అందుకొని నూతన జీవితాన్ని గడపాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులకు సంబంధించిన రివార్డులో నరహరికి రూ.25 లక్షలు, దానమ్మకు రూ.35 లక్షల చెక్కులను మొదటి వాయిదా కింద అందజేస్తున్నామని ఆయన తెలిపారు. దేశంలోనే మావోయిస్టు తీవ్రవాదాన్ని అరికట్టడంలో ఆరితేరిన రాష్ట్ర గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాల కార్యకలాపాలు ఇకముందు కూడా కొనసాగుతాయని ఆయన ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. మావోయిస్టుల కార్యలాపాలు పూర్తిగా అరికట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనకు, ఇంకా ఉన్నారంటూ మీరు తెలిపిన సమాచారం పరస్పరం విరుద్ధం కాదా అనే ప్రశ్నకు... అలాంటిదేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో లంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పునరావాస కార్యాకలాపాలు, ఆర్థికంగా ఇస్తున్న చేయూత సక్రమంగా అందుతున్నాయనీ, అయితే రెండు నెలలకోసారి తానే స్వయంగా క్షేత్రస్థాయిలో తిరిగి మాజీ మావోయిస్టుల స్థితిగతులు ఎలా ఉన్నాయి, వారికి ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయి, తదితర అంశాలను సమీక్షించి, తగిన చర్యలు తీసుకుంటానని ఆనంద్ తెలిపారు.

**నరహరి నేపథ్యం**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన పసునూరి నరహరి విద్యార్థి దశలోనే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ ప్రభావంతో ఉద్యమంలో చేరి, 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో సభ్యుడిగా చేరారు. అనంతరం ఛత్తీస్‌గఢ్, నాగ్‌పూర్, బీహార్, జార్ఖండ్ ప్రాంతాల్లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థలో ఉన్నతస్థాయికి ఎదిగారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది, తర్వాత బీహార్‌జార్ఖండ్ ప్రత్యేక ప్రాంత కమిటీకి కీలక బాధ్యతలు చేపట్టారు. నరహరి ఆయుధాల తయారీ, మరమతులు, నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉండటంతో పాటు తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, రాకెట్ ప్రొఫెల్డ్ గ్రెనేడ్లు, బూబీ ట్రాప్‌ల తయారీలో కీలక పాత్ర పోషించాడని పోలీసులు తెలిపారు. సంస్థ క్యాడర్‌కు సాంకేతిక శిక్షణ కూడా అందించినట్టు వివరించారు.

**దానమ్మ నేపథ్యం**

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గ్రామలపాడుకు చెందిన మేదర దానమ్మ 1986లో ఉద్యమంలో చేరి, అనంతరం వివిధ బాధ్యతలు నిర్వహించారు. 2004లో నాగ్‌పూర్‌లో అరెస్టై, 2011 వరకు జైలులో ఉండి, బెయిల్‌పై విడుదలైన తర్వాత తిరిగి పార్టీలో చేరారు. 2018లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది బీహార్‌జార్ఖండ్ ప్రాంతంలో సంస్థాగత, సాంకేతిక బాధ్యతలు నిర్వహించారు.

**'822 మంది లంగిపోయారు'**

డీజీపీ కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం... 2024 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 822 మంది మావోయిస్టులు లంగిపోయారు. ఇందులో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 23 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు ఉన్నారు. అదే కాలంలో 334 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. పరిస్థితులు బాగాలేవు.. వచ్చేయండి : అజ్ఞాత మావోయిస్టులకు నరహరి పిలుపు పరిస్థితులు బాగాలేవనీ, సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపించే ఎలాంటి సానుకూల వాతావరణం లేదనీ, వెంటనే అజ్ఞాత జీవితం వీడి తెలంగాణ ప్రభుత్వం ముందు లంగిపోవాలని మావోయిస్టు అగ్రనేత పుసునూరి నరహరి పిలుపునిచ్చారు. తాను తన భార్య కూడా పరిస్థితులు బాగాలేకనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మిస్రి అనుమతి తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలిశామని తెలిపారు.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

మైనర్ బాలికపై లైంగికదాడికి సంబంధించి పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ జిల్లా కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరురోజులపాటు తమకు అప్పగించాలంటూ నాలుగు రోజుల క్రితం సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సిట్ పిటిషన్‌పై విచారించిన కోర్టు బుధవారం నుంచి పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం ఆయన్ను చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. కూకట్‌పల్లిలోని సిట్ కార్యాలయంలో రీతూరాజ్ నేతృత్వంలో దర్యాప్తు బృందం విచారించనుంది. ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం రూపొందించింది. మైనర్ బాలికపై లైంగికదాడితోపాటు వారి మధ్య జరిగిన ఫోన్ చాటింగులను భగీరథ్ డిలీట్ చేయడం, బాలికకు రూ.50వేలు ఇచ్చాను అని ఆయన చేసిన ప్రకటనపై సిట్ మరింత లోతుగా విచారించనున్నట్టు తెలిసింది. లైంగిక దాడి ఆరునెలల క్రితం జరిగినట్టు భగీరథ్ పేర్కొంటున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఆధారాలను సేకరించనుంది. మైనర్ బాలిక తల్లి వాగ్మూలాన్ని పూర్తిగా క్రోడీకరించి, భగరీథ్ నుంచి అదనపు సమాచారాన్ని, నిజాలను వెలికి తీసేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మొత్తం మీద సిట్ అధికారుల విచారణలో నిందితుడు ఏమేరకు అంగీకరిస్తారనే కోణంలో ఇటు రాజకీయ వర్గాలు, అటు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో చూడాల్సిందే.




# రైతుకు భరోసా.. విద్యార్థికి చేయూత

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
- మద్దులమడలో 'రచ్చబండ' నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- పోడు రైతులకు ఉచిత బోర్ మోటార్లు
- గిరిజన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.




ఇందులో భాగంగా మద్దులమడ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ (రచ్చబండ)లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధికారులతో కలిసి ప్రజల మధ్య కూర్చుని, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల కొరత లేకుండా చూస్తామని ఈ సందర్భంగా ప్రజలకు గట్టి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన నిరూపించారు. అనంతరం నల్లబడు గ్రామంలో గిరిజన పోడు రైతుల జీవితాల్లో వెలుగులు నింపేలా కీలక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్టీ లబ్ధిదారుల పోడు భూములకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిసిటీ లైన్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సాగునీటి ఇబ్బందులు కలగకుండా రైతులకు ఉచితంగా బోర్ మోటార్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉచిత విద్యుత్, మోటార్ల సాయంతో ఇకపై పోడు భూములు పచ్చని పంటలతో కలకలలాడనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మరోవైపు గిరిజన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో, ఉన్నత విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదినారాయణ ఉచిత ల్యాప్‌టాప్‌లను అందజేశారు. సాంకేతికంగా గిరిజన యువత ప్రపంచంతో పోటీపడి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఆశయంతోనే ఈ ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అటు ప్రజా సమస్యల పరిష్కారం, ఇటు రైతన్నలకు ఉచిత కరెంట్ బోర్ మోటార్లు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీతో అశ్వారావుపేట మండలంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహూల్ (ఐఏఎస్ ), అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నశెట్టి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, స్థానిక ఎంఆర్ఓ, ఎంపీఓ రామకోటిరెడ్డి, సర్పంచులు చిప్పల పందు రెడ్డి, సత్యం లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# రేణుక ఎల్లమ్మ తల్లి.. జర సల్లగా చూడమ్మా..!

- చిన్నకల్వల గ్రామంలో అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

రేణుక ఎల్లమ్మ తల్లి.. జర సల్లగా చూడు తల్లి అంటూ సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామస్తులందరూ అమ్మవారిని వేడుకున్నారు.గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలు మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని, బైండ్ల వారి ఆటపాటలతో, డప్పు చప్పులతో, శివసత్తుల పూనకాలతో రేణుక ఎల్లమ్మ తల్లి వద్దకు చేరుకొని నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకల్వల గౌడ సంఘం అధ్యక్షులు గుర్రం సత్తయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ఏరుకొండ మొగిలి గౌడ్, డైరెక్టర్లు గుర్రం శ్రీనివాస్ గౌడ్, బండి అంజయ్య గౌడ్,ఏరుకొండ రాజీరు గౌడ్, పూదరి శ్రీనివాస్ గౌడ్, బొంగోని చంద్రయ్య గౌడ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, బండి ఎల్లయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ ఏరుకొండ స్రవంతి రమేష్ గౌడ్, ఉపసర్పంచ్ బొంగోని కుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గుర్రం సంపత్ గౌడ్, గౌడ సంఘం నాయకులు బండి శరువయ్య గౌడ్, ఏరుకొండ మొండయ్య గౌడ్, మామిడి లింగయ్య గౌడ్, గుర్రం మొండయ్య గౌడ్ ,గుర్రం శంకర్ గౌడ్, బొంగోని కిష్టయ్య గౌడ్, బండి తిరుపతి గౌడ్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇంచార్జ్ అధ్యక్షుడుగా కె.అశోక్ కుమార్

- మాజీ అధ్యక్షునికి జ్ఞానేస్వర్‌కు ఘన సత్కారం

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:**



ఉస్మానియా విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇన్చార్జి అధ్యక్షుడుగా కె.అశోక్ కుమార్ నియమితులయ్యారు.ఇప్పటి వరకు ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్న అశోక్ కుమార్ నేడు ఇన్చార్జి అధ్యక్షుడుగా ఎన్నికల కావటం పట్ల కోపరేటివ్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వంద మంది సభ్యులు గల ఈ కోపరేటివ్ సొసైటీకి ఉస్మానియా యూనివర్సిటీలో మంచి పేరు కలిగి ఉంది. ఇలాంటి కోపరేటివ్ సొసైటీ ఇన్చార్జి అధ్యక్షులు కలవడం తన అదృష్టంగా భావిస్తానని సభ్యుల సహకారంతో సొసైటీ ఆర్థిక అభివృద్ధికి ఉద్యోగుల ఉన్నతికి కృషి చేస్తారని అశోక్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఓయూ వ కోపరేటివ్ సొసైటీలో జనరల్ బాడీ సమావేశంలో అశోక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఏప్రిల్ వరకు అధ్యక్షుడుగా కొనసాగుతున్న బియ్యాని. జ్ఞానేశ్వర్ పదవీ విరమణ చేయటంతో ఆయనను ఈ జనరల్ బాడీ సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఆయన అధ్యక్షుడు గా గత 10 సంవత్సరాలుగా చేసిన సేవాలను సభ్యులు కొనియాడారు. రానున్న కాలంలో కోపరేటివ్ సొసైటీ ఔన్నత్యాన్ని మరింత పెంపొందించనున్నట్లు అశోక్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ , సెక్రటరీ కె.ఎస్. నాగరాజారావు,రామాంజనేయులు, అస్లాం, నర్సింగ్ రావు, నర్సింగ్, సరోజ, సత్యవతి, సభ్యులు పాల్గొన్నారు.



# కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- ఐఎన్‌టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్
- పెంచుతున్న ఇంధన ధరలను వెంటనే తగ్గించాలి
- కొత్తగూడెంలో ప్లకార్డులతో ఆటో కార్మికుల నిరసన
- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో, తెలంగాణ చౌరస్తా:**



కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు పెంచుతున్న డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్లో ఆటో డ్రైవర్లతో కలిసి ప్లకార్డులు పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కనకం సూరిబాబు మాట్లాడుతూ.. కొద్ది రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలను ఇంత భారీగా పెంచడం సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్య జీవితంలో కీలకమైన పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. దీనివల్ల సామాన్యుడి జీవనం మరింత కష్టతరంగా మారిందన్నారు.

**సంక్షోభంలో ఆటో కార్మికుల జీవితాలు:**

ఇంధన ధరల పెరుగుదల వల్ల ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సూరిబాబు పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధి తగ్గి కుటుంబ పోషణ భారమైన తరుణంలో.. ఈ ధరల పెరుగుదల వారి జీవితాలను మరింత సంక్షోభంలోకి నెట్టేస్తోందన్నారు. రోజంతా కష్టపడినా వచ్చే సంపాదనలో ఎక్కువ భాగం పెట్రోల్, డీజిల్‌కే సరిపోతోందని, కనీసం కుటుంబ అవసరాలు కూడా తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతాంగంపైనా తీవ్ర ప్రభావం :**

వ్యవసాయ పనుల్లో డీజిల్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, తాజా ధరల పెంపుతో సాగు ఖర్చులు పెరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్న రైతులకు ఇది కోలుకోలేని దెబ్బ అని పేర్కొన్నారు.

**పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి :**

పెట్రోల్, డీజిల్ ధరలను (జీఎస్టీ) పరిధిలోకి తేవాలని ఎన్నిసార్లు విన్నవించినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని దుయ్యబట్టారు. ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి, పేద, మధ్యతరగతి వర్గాలపై భారం మోపడం ప్రజా వ్యతిరేక విధానమని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం తన మొండివైఖరి వీడి ధరలను తగ్గించకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చల్లంగి శ్రీనివాస్, శోభన్, ప్రేమ్, పాషా, హైమద్, గంగులు, గట్టయ్య, సర్వయ్య, నరసింహ, మోహన్, కుమార్, సికందర్, లోక్యా, శ్యాం కుమార్, ఫిరోజ్, నూర్ మహమ్మద్, రమేష్, శివ, మౌలాలి,పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.



# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటి డాగ్ 'రోలెక్స్' తనిఖీలు

**తెలంగాణ చౌరస్తా నడిగూడెం:**

జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు నడిగూడెం మండల వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నార్కోటి డాగ్ రోలెక్స్ తో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అజయ్ కుమార్ మాట్లాడుతూ. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్,టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు,బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించారు.ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని తెలిపారు.డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు.ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మండల వ్యాప్తంగా గంజాయి పై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దున్న శ్రీనివాస్, నాయకులు గుండు శ్రీనివాస్,పందిరి వెంకటరెడ్డి, కాసాని వెంకన్న,పల్లపు శ్రీనివాస్, మహమూద్, నాగభూషణం,కాసాని శివ,బడేటి శ్రీనివాస్, కాసాని పుల్లయ్య ఇస్మాయిల్, సంజీవ రెడ్డి,రామిరెడ్డి, మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవతామూర్తి కంచర్ల లక్ష్మికి విప్లవ జోహార్లు

ఆశయం కోసం నడిచే కొడుకు వెనుక... అడుగడుగునా కన్నీళ్లను దిగమింగుకుంటూ ఆశీర్వదించే అమ్మ త్యాగం ఎంతటిదో కొలవడానికి ఏ కొలమానాలూ సరిపోవు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్, తెలంగాణ ఉద్యమ కెరటం, పూర్వ డీఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు, స్వరాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కుల కోసం, సామాజిక తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడుతున్న యువనేత... మన కంచర్ల భద్రన్న (రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక). నిర్బంధాలు, అక్రమ కేసులు, ఉపా (UAPA) చట్టాల బెదిరింపులు, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో, అమ్ముడుపోని ఆత్మగౌరవంతో నిలిచిన భద్రన్న వ్యక్తిత్వం వెనుక... ఆ గర్భాన జన్మనిచ్చి, పోరాట పాలు తాగించిన ఆ మాతృమూర్తి సంస్కారముంది.



భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం, గిద్దె ముత్తారం గ్రామంలోని ఒక అట్టడుగు పేద రజక కుటుంబంలో జన్మించిన భద్రన్న... నేటి రాజకీయాల్లో కనిపించే ఆస్తుల పోటీకి, పదవుల వ్యామోహానికి ఆమడ దూరంలో నిలిచాడు. నమ్మిన సిద్ధాంతం కోసం, నైతిక విలువల కోసం నికరంగా నిలబడిన అరుదైన, అసలైన ఉద్యమకారుడు. ఈ రోజుల్లో ఉద్యమాల పేరుతో పదవులు, సంపాదనలు, మేడలు, మిద్దెలు కూడబెట్టుకున్న ముసుగు వీరులను ఎందరినో చూస్తున్నాం. కానీ, ఆశయాల కోసం, సమాజ హితం కోసం తమ జీవితాలనే త్యాగం చేసే నిలువెత్తు మనుషులు నేటి కాలంలో చాలా అరుదు. ఆ అరుదైన వ్యక్తుల్లో ముందువరుసలో నిలిచే నిఖార్సయిన పేరు —— భద్రన్న.

ఆర్థిక ఇబ్బందులు... కుటుంబ బాధ్యతలు... పిల్లల చదువులు... ఒకవైపు కోర్టుల చుట్టూ కేసులు... మరోవైపు పాలకుల నిర్బంధాలు... ఇన్ని తుఫానులు చుట్టుముట్టినా ఎక్కడా తలవంచకుండా, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకుండా జీవించడం ఎంత కష్టమో భద్రన్న జీవితాన్ని చూస్తే తెలుస్తుంది. మహానగరం హైదరాబాద్‌లో కుటుంబాన్ని నిలబెట్టుకోవడమే ఒక రోజువారీ యుద్ధంగా మారిన పరిస్థితుల్లో కూడా, నమ్మిన విలువలను వదులుకోకుండా నిలబడటం సామాన్యమైన విషయం కాదు. అది కేవలం ఒక ఆశయ జీవికి మాత్రమే సాధ్యం. "కొన్నిసార్లు కనీస ఖర్చులకు కూడా డబ్బులు లేవు..." అనే మాట వెనకాల ఎంతటి మౌన వేదన, ఎంతటి ఆత్మసంఘర్షణ దాగి ఉందో భద్రన్నను దగ్గరగా చూసిన వాళ్లకే తెలుస్తుంది. అలాంటి దుర్భర పరిస్థితుల్లో కూడా తన వ్యక్తిత్వాన్ని అమ్ముకోకుండా, ఆలోచనలను తాకట్టు పెట్టకుండా, పోరాటాన్నే శ్వాసగా, జీవితంగా మలుచుకున్న నిప్పుకణిక భద్రన్న. ఈ సుదీర్ఘ పోరాటంలో భద్రన్నకు అండగా, నీడగా నిలిచిన వదినమ్మ త్యాగానికి రెండు చేతులెత్తి నమస్కరించాల్సిందే. ఎందుకంటే, ప్రతి ఆశయ జీవి వెనుక కంటికి కనిపించని ఎన్నో కుటుంబ త్యాగాలు ఉంటాయి.

**అమ్మ మరణం.....తీరని లోటు**

ఇటీవల అమ్మ కంచర్ల లక్ష్మి గారి మరణం భద్రన్న జీవితంలో తీరని శోకం, పూడ్చలేని విషాదం. ఒకవైపు అక్రమ కేసులు వేటాడుతుంటే... మరోవైపు అమ్మ ఆరోగ్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, భద్రన్న లోపల ఎన్నో మౌన యుద్ధాలు చేశాడు. కన్నతల్లిని రక్షించుకోవాలని ఆరాటపడ్డాడు. కానీ, కాలం ఆ తల్లిని దూరం చేసింది. అయినా...,అమ్మ హాస్పిటల్ లో ఉన్న మళ్లీ ప్రజా క్షేత్రంలోకి వచ్చాడు, మళ్లీ పోరాటాలనే ఎంచుకున్నాడు. ఎందుకంటే, కొందరికి ఉద్యమం అనేది ఒక తాత్కాలిక అవసరం కాదు... అది వారి ఊపిరి..! ప్రజా ఉద్యమాలు అంటే కేవలం సభలు, వేదికలు, మైకుల ముందు నినాదాలు కావు... తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన మనుషుల నెత్తుటి చరిత్ర. బతకడం అంటే ఎలాగైనా బతకొచ్చు, కానీ నమ్మిన సిద్ధాంతానికి రాజీ పడకుండా, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకుండా జీవించడమే నిజమైన బతుకు. నేటి స్వార్థ పూరిత తరానికి భద్రన్నలాంటి మనుషుల ఆదర్శం ఎంతో అవసరం. ఎందుకంటే ఆశయాలు చనిపోతే సమాజం శవంగా మారుతుంది. తన రక్తాన్ని పంచి, పేదరికాన్ని ఓర్చి, ఈ సమాజానికి ఒక నిఖార్సయిన ఉద్యమ నేతను అందించిన ఆ కన్నతల్లి రుణం తీరనిది. మట్టి తల్లి కంచర్ల లక్ష్మికి విప్లవ జోహార్లు..! పోరాట యోధుడిని కన్న ఆ మానవతామూర్తి, అమ్మ లక్ష్మమ్మకు శ్రద్ధాంజలి..! అమ్మా...నీవు భౌతికంగా దూరమైనా, నీ కొడుకు చేసే ప్రతి ప్రజా పోరాటంలోనూ నీవు సజీవంగా నిలిచే ఉంటావు.

**అమ్మకు విప్లవ జోహార్లు**

**డా :ఆర్.ఎల్. మూర్తి నిరుద్యోగ జేఏసీ కన్వీనర్**




# ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తాం

- కాంగ్రెస్ నేతల తీరుపై బీఆర్ఎస్ నేతల ఫైర్

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

ప్రతిపక్ష పార్టీగా, ప్రజల తరుపున ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తామని పెద్దపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలపై ఫైర్ అయ్యారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో అన్నదాతలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిపక్ష పార్టీ హోదాలో మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యేపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులకు, ప్రస్తుతం ఓపెనింగ్‌లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అంతా చూస్తున్నారని.. గమనిస్తున్నారని, ఇప్పటికైనా తప్పుడు కూతలు బంద్ చేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ప్రెస్‌మీట్ పెట్టవద్దు, మాట్లడవద్దు అంటున్నారు. కానీ ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తాం, ప్రశ్నిస్తాం, కొట్లాడుతాం. కాంగ్రెస్ నాయకుడు మస్రత్ నోటికి ఎంత వస్తే అంతా మాట్లాడుతున్నాడు.. ముందు నీ పార్టీలో నీ స్థాయి ఏంటో తెలుసుకో, మాట్లాడితే పదవులు వస్తాయనే ఆశతో కొందరు ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు మాట్లాడుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాళ్లు మొక్కిన వాళ్లు నేడు పదవుల కోసం, తమ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రెండున్నర ఏళ్లల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏం లేదని.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పెద్దపల్లిలో గెలిచేది దాసరి మనోహర్‌రెడ్డియే అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశిపాక వాసు, ఎండీ ముఖీం, బొద్దుపల్లి రమేష్, ఫహీం, పల్లె మధు, ఎండీ రఫీ, కుక్క మనోజ్, ఆదిల్ ఖాన్, ఎండీ అతీక్, ఎండీ ముజాషిర్, అజర్, జుబేరీ, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## అర్హులైన జర్నలిస్ట్ లందరికీ అక్రిడిటేషన్ కార్డ్ లు

- **మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభించిన కలెక్టర్ స్నేహశబరీష్**

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**
నిబంధనల మేరకు అర్హులైన జర్నలిస్ట్ లందరికీ అక్రిడిటేషన్ కార్డ్ లను అందజేస్తామని,ఇది నిరంతర ప్రక్రియ అని మహబూబాబాద్ జిల్లాకలెక్టర్,జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ స్నేహశబరీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కు తొలి అక్రిడిటేషన్ కార్డ్ ను అందజేసి కలెక్టర్ స్నేహశబరీష్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంబించారు. అనంతరం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నవాబ్, బిక్షంగౌడ్,గాడిపల్లి శ్రీహరి, అయోధ్యరామయ్య,రంగాచౌదరి లకు జిల్లాకలెక్టర్ స్నేహశబరీష్ స్వయంగా కార్డ్ లను అందజేసారు. అనంతరం జర్నలిస్ట్ ల సమస్యలు, జిల్లా లోని పలు అంశాలపై కొంతసేపు చర్చించారు. జర్నలిస్టు లకు అక్రిడిటేషన్ కార్డ్ ల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపిన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ కు టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.





## గ్రామ దీపికల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **కాంగ్రెస్ నిర్లక్ష్యం వీడాలి**
- **వీఓఏలకు రూ.20 వేల వేతనం ఇవ్వాల్సిందే**
- **గ్రామ దీపికల సమ్మెకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు**
- **అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వరరావు సంఘీభావం**

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**
అశ్వారావుపేట రింగు రోడ్డు వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న గ్రామ దీపికల ( వివో ఏ ఎస్ )దీక్షా శిబిరాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు సందర్శించారు. పార్టీ నాయకులతో కలిసి వారికి సంఘీభావం తెలిపిన ఆయన, గ్రామ దీపికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.



మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామ దీపికలు న్యాయం కోసం దీక్షలు చేస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏసీ గదుల్లో సేదతీరుతున్నారని మెచ్చా నాగేశ్వరరావు మండిపడ్డారు. పాలకులకు మహిళల కష్టం, ఆవేదన కనబడడం లేదని, మహిళలు కన్నీరు పెట్టుకున్న రాజ్యం ఎప్పుడూ బాగుపడిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ దీపికలపై ప్రభుత్వం చిన్నచూపు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వీఓఏలకు న్యాయం జరిగిందని, అప్పట్లో రూ. 3 వేలుగా ఉన్న గౌరవ వేతనాన్ని మాజీ సీఎం కేసీఆర్ రూ. 5 వేలకు పెంచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామ దీపికలపై పనిభారం పెరిగినా, తగిన గుర్తింపు లేదా వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో వీఓఏలకు నెలకు రూ. 20 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు.
గ్రామ దీపికల లను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లి, పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ దీపికలందరికీ వెంటనే రూ. 20 వేల వేతనం. చేయాలని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దీక్షలో ఉన్న గ్రామ దీపికల కొరకు కాసాని నాగ శేష పద్మ (చంద్ర మోహన్) మంచినీరు, కొబ్బరి నీళ్ల వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జూపల్లి రమణరావు, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, ప్రకాశ్ రావు, కాసాని నాగ శేష పద్మ (చంద్ర మోహన్), కౌన్సిలర్ భూక్యా ఉదయ జ్యోతి (ప్రసాద్), జజ్జూరపు శ్రీరామమూర్తి, సత్యవరపు సంపూర్ణ, నారం రాజ్ శేఖర్, జ్యోత్స్న, గోవింద్, జీవన్ రావు, తగరం జగన్నాథం, వేలేటి. టిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



## మాటేడు గ్రామంలో అగ్నిప్రమాదం

- **రైతుకు భారీ నష్టం**
- **బాధిత రైతును పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి**

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**
తొర్రూరు మండలం మాటేడు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మామిడి తోట దగ్ధమై రైతుకు భారీ నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి మంగళవారం బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎమ్మార్వో, హార్టికల్చర్ అధికారులు పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయంపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బాధిత రైతుకు తగిన న్యాయం జరిగేలా చూడాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అధికారులను కోరారు. వ్యవసాయ అవశేషాలను కాల్చకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని నాయకులు సూచించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చర్లపాలెం గ్రామ సర్పంచ్ ధర్మారపు మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని రైతుకు సంఘీభావం తెలిపారు.



## ఇకపై ఒకటో తారీఖునే జీతాలు

- **గ్రామ పంచాయతీ సిబ్బందికి సీఎం బరోసా**
- **ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేక నిధులు**
- **ఇక నుంచి బ్యాంక్ ఖాతాల్లోనే పింఛన్లు జమ**
- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్కతో కలిసి సీఎం సమీక్ష**
- **అర్హులకే పింఛన్లు అందేలా ఓటర్ ఐడీ, ఆధార్, సీపెక్ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులకు నెల నెల సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా జీతాలు అందాలన్నారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలన్నారు. స్వంత ఆదాయంపై గ్రామపంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ఆసరా పింఛన్ల ప్రస్తుత విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని సీఎం ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందేలా ఓటర్ ఐడీ, ఆధార్, సీపెక్ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలని సూచించారు. కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీరాజ్ ప్రతేక కార్యదర్శి దానకిషోర్, కమిషనర్ డి.దివ్య దేవరాజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మలి దశ ఉద్యమానికి బెల్లి లలితక్క పాట ఊపిరీ

- **కొమ్మనబోయిన సైదులు యాదవ్**
- **ఓయూలో బెల్లి లలితక్క వర్ధంతి**

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:**
ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క 27వ, వర్ధంతి కార్యక్రమంను ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రముఖ ఉద్యమం గాయకురాలు, తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క తన అట, పాటలతో ప్రజలను, మహిళలు ను చైతన్య పరచడంలో ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. మలి దశ తెలంగాణ ఉద్యమంకి ఆమె పాట ఊపిరి పోసిందన్నారు.తెలంగాణ కళ సాహిత్యం వ్యవస్థాపకురాలు, సాహిత్యం మండలి కార్యక్రమం లో చురుకుగా పాల్గొనే చైతన్య దీపిక బెల్లి లలితక్క అని వారు తెలిపారు.భువనగిరి లో నిరుపేద కుటుంబం లో పుట్టి, చిన్న వయస్సులో కుటుంబం కోసం చదువు మానేసి స్పిన్నింగ్ మిల్లు లో కార్మికురాలు గా ఉద్యమం నడిపిన వీర వనిత అని వారు తెలిపారు.భువనగిరి బస్తీ లో సమస్యలు పై పోరాటం చేస్తూ నీటి సమస్యలు పై ఉద్యమం చేస్తూ మహిళలను చైతన్య పరుస్తూ మహిళ స్రవంతి ని స్థాపించారు అని చెప్పారు.సమాజంలో అసమానతలు, ప్రాంతీయ వివేదం లల పై ఉద్యమం చేసిన గొప్ప చైతన్య శీలి అని వారు తెలిపారు.సారా వ్యతిరేకం ఉద్యమం, పాన్ పరాగ్, గుట్కా వ్యతిరేకం ఉద్యమం చేసి ప్రజలను, మహిళలను, యువత చైతన్య పరిచడంలో ప్రధాన పాత్ర పోషించిదన్నారు.తెలంగాణ జనసభ లు పేరుతో ఊరురు ఊరు తిరుగుతూ జిల్లాలు తిరుగుతూ ప్రజలను చైతన్య పరుస్తూ సమాజంలో ఉద్యమం ను ఉవ్వేత్తు న్న రగిలించడంలో పోరాటం నేర్పిన గొప్ప రణ శీలి అని వారు తెలిపారు.బెల్లి లలితక్క సమాజ అసమానతలు తొలిగించడం లో ఉద్యమం స్ఫూర్తి కొనసాగించడం లో గొప్ప త్యాగ శీలి అని వారు తెలిపారు.వారి ఆశయ సాధన కోసం యువత, విద్యార్థులు కృషి చేయాలని చెప్పారు.ఆమె ఆలోచన విధానం ను కొనసాగించాలి అని వారి పోరాటం స్ఫూర్తి విద్యార్థులు కొనసాగించాలి అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో తోకల చిరంజీవి,ఓయూ విద్యార్థి నాయకులు ఆవుల చిరంజీవి, సురేష్‌యాదవ్, సురేందర్,సిద్దు యాదవ్, ప్రభాకర్, రాథోడ్, మధు,అనిల్,సంజయ్, రవి పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమం కోసం రంగంలోకి సర్పంచ్ పూర్ణ

**కొత్తగూడెం, తెలంగాణ చౌరస్తా:**
ప్రజా సంక్షేమం కోసం రంగంలోకి దిగిన సర్పంచ్ లావుడ్య పూర్ణ.తెలంగాణ ప్రభుత్వం అతి త్వరలో 2 లక్షలకు పైగా కొత్త పెన్షన్ల మంజూరుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో,నూతన పెన్షన్ల లబ్ధిదారుల సౌకర్యార్థం పెద్దతండా పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య పూర్ణ స్వయంగా పాల్గొని ప్రజలకు అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో వితంతు,వృద్ధాప్య మరియు వికలాంగుల పెన్షన్ దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందజేసి, యువకులతో కలిసి ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి దరఖాస్తులు నింపించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. కేవలం ఫారాలు పంపిణీ చేయడమే కాకుండా, స్వయంగా దగ్గరుండి ప్రతి ఒక్కరి వివరాలు పరిశీలిస్తూ, అప్లికేషన్ ప్రక్రియను సులభతరం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యలను అర్థం చేసుకొని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ సేవా తత్వాన్ని గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ,సంక్షేమ పథకాల అమలులో ముందుండి పని చేస్తూ నూతన మార్గాన్ని చూపిస్తున్నారని గ్రామస్థులు అభినందనలు తెలిపారు."ప్రజల సేవే నా ధ్యేయం.. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాను" ఈరోజు మొత్తం 27 అప్లికేషన్లు వచ్చాయని ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ తెలిపారు.గ్రామ ప్రజలు సర్పంచ్ సేవలను కొనియాడుతూ, ఇలాగే ప్రజా సంక్షేమం కోసం ముందుండి సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఇస్మాయిల్, యువ నాయకులు ధరావత్ హనుమాన్,నూనావత్ గణేష్, లావుడ్య శ్రీహరి, భూక్యా జాను, పద్మావత్ విజయ్ కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని విద్యాసంస్థలపై దాడులు చేస్తాం

- **అనుమతులు లేని పాఠశాలల,కళాశాలల పేర్లు బహిర్గతం చేయాలి**
- **గుర్తింపు లేని విద్యాసంస్థలకు అనుకూలంగా అధికారులు**
- **ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామరాపూ వెంకటేష్,మచ్చ రమేష్**



**కరీంనగర్ తెలంగాణ చౌరస్తా:**
కరీంనగర్ జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల,కళాశాలల పేర్లు బహిర్గతం చేయాలని,అనుమతి లేని పాఠశాలలకు కళాశాలలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని,అనుమతి లేని అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి రామారావు వెంకటేష్,మచ్చ రమేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఏ పాఠశాలలకు,కళాశాలకు అనుమతులు ఉన్నావి ఏ పాఠశాలలకు, కళాశాలలకు అనుమతులు లేవో బహిర్గతం చేయాలని,అనుమతి ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అడ్మిషన్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు,బుక్స్ ఫీజు, యూనిఫామ్ ఫీజు, ఇలా ఇంకా అనేక రకాల పేర్లతో నిబంధనలను మించి ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల తనిఖీ చేయకుండా ఫీజుల వివరాలు తెలుసుకోకుండా వారి మామూలకు కక్కుర్తి పడి వారి దోపిడీకి సహకరిస్తున్నారని,ఒక బ్రాంచ్ కి అనుమతి ఉంటే అనేక రకాల బ్రాంచులతో అనుమతులు లేకుండా నిర్వహణ చేస్తున్నారని, కరీంనగర్ జిల్లాలో అనుమతిలేని, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయా విద్యాసంస్థల ముందు ఆందోళన నిర్వహించే ప్రత్యక్ష దాడులు చేస్తామని వెంకటేష్ ,రమేష్ హెచ్చరించారు.

## నకిలీ విత్తనాలను అరికట్టాలి

- **నాణ్యమైన విత్తనాలు అందించాలి**
- **రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాము**



**ఇల్లందకుంట, తెలంగాణ చౌరస్తా:**
నకిలీ విత్తనాలను అరికట్టాలని,రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించాలని,తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము కోరారు.ఇల్లందకుంట మండల కేంద్రంలో మాట్లాడుతూ...కరీంనగర్ జిల్లాలో వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేసి,రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి ఏడాది నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు కఠిన చర్యలు తీసుకొని నకిలీ విత్తనాల వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో తనిఖీలు నిర్వహించి,రైతులకు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను అందించాలని కోరారు.రైతులు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రేపు రాజీనామా!

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు తథ్యంగా కన్పిస్తోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవిని వదులుకోనున్నట్లు తెలుస్తోంది. గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నేతలతో పలు దఫాలు చర్చలు జరిపింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలాతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు.సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు ఆ సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది. సిద్ధూ కుమారుడు యతీంద్రకు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రతిపాదనలను తొలుత సున్నితంగా తిరస్కరించిన సిద్ధరామయ్య.. తన మద్దతుదారులతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. ఖర్గే రాజ్యసభ సభ్యత్వం త్వరలో ముగుస్తుండటంతో ఆయన స్థానాన్ని సిద్ధూతో భర్తీ చేయాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తంగా కర్ణాటక సంక్షోభాన్ని రాజ్యసభ ఎన్నికల సందర్భంగా పరిష్కరించుకోవాలని అధిష్ఠానం తలపోస్తున్నట్లు అర్థమవుతోంది.